వైకుంఠపాళి

కిటికి దగ్గర కూర్చొన్న వెంకట్రామయ్య ఆలోచనలు రైలు కంటే వేగంగా పరిగెడుతున్నాయి. కంపార్టుమెంట్‌లో కూర్చున్న జనం పత్రికలు చదవడంలో కొందరు, పల్లీలు తినడంలో మరికొందరు, యింకా కొందరేమో ముచ్చట్లలో మునిగివున్నారు. ఎవరో చిన్న కుర్రవాడు శరీరమంతా దుమ్ము ధూళితో కొటింగ్ లాగ వున్నవాడు చేతిలో గుడ్డ పేలికలతో కంపార్టుమెంట్‌లోని చెత్తనంతా ఒకచోటికి చేరుస్తున్నాడు.

రైలు పోవలసినంత వేగంగా పోవటంలేదు. దీన్నిబట్టి రైళ్ళు ఎందుకు లేటౌతాయో ఊహించవచ్చు.

వెంకట్రామయ్య ఒక్క కొడుకు బాగా చదివి పెద్ద ఆఫీసరయ్యి, తనకు తన వూరికి దూరమయ్యాడు. ఎప్పుడో వానికి పెద్దబ్బాయి పుట్టినపుడు ఇరువై ఏళ్ళక్రింద ఊరొచ్చి పోయాడు. వ్యవసాయ పనుల వల్ల తానురాక పదేళ్ళు కావచ్చు. అప్పుడు పెద్దోని తర్వాత దానికి ఎనిమిదేండ్లు. అదిప్పుడు పెండ్లీడుకు రావచ్చు. తనను గుర్తు పట్టుద్దో లేదో. అప్పుడే తాను చుట్ట తాగటం చూసి ' తాతయ్య పొగఃండి'' అని నవ్వేది. రాక పోకలకు వ్యవది పట్టడం తాను ఊరువదలక పోవడమే.

పాతికేండ్ల క్రితం తనభార్య పోయినాక అన్ని బరువు భాద్యతలు, వ్యవసాయం వ్యవహారం తనొక్కడే చూసుకుంటూ వుండడం .యిల్లరికపుటల్లుని, అమాయకపు కూతుర్ని, ఆమె పిల్లలను కనిపెట్టుకొని వుండడమే అదీ కాకుండా తన కొడుకు చదువు పూర్తికాగానే' ఆ ఇన్‌కంటాక్స్ ఆఫీసర్‌గా వుద్యోగం రావటం, ఆ వెంటనే అప్పటికి అయనను ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకోవటం, పెళ్లైన కొత్తలోవొచ్చి ఊరినిచూసి విస్తుపోయి, వచ్చిన రోజు సాయంత్రమే తిరిగివెళ్ళటం, అదేమిటని అబ్బాయిని అడిగితే ఆవిడ కాలుకు మన్నంటకుండా తిరిగే మనిషి స్నానం చేయటానికి కూడా ఇబ్బందిగా ఉందట. మీరే మాదగ్గరకి వస్తు వుండండి అంటు వాళ్ళు వచ్చిన కారు కదిలి పోయింది. ఆ తర్వాత చెల్లెలు పెండ్లికొచ్చి ఆ పూటే వెళ్ళి పోయారు.

చిల్లర నాణేల చప్పుడు కాగానే, తన ఆలోచనల నుండి దృషి చప్పుడొచ్చిన వైపు మరల్చాడు.

ఎదురుగా యింతవరకు కంపార్ట్‌మెంట్‌ను తుడిచిన కుర్రవాడు. విషయం అర్థం చేసుకున్న వెంకట్రామయ్య ఓ పావలా అతని చేతిలో పెట్టాడు.

పదేళ్ళ క్రితం తన మనవడు ఇదే వయసులో వుండే. అప్పుడే ఎంతో చురకైన వాడు. యిప్పుడు కాలేజీ చదువుల్లో బాగానే వుండచ్చు. ఆ అసాధ్యురాలు మనవరాలు తాను వస్తున్నానని రాసిన కార్డు చదివి. ఏంది తాతయ్య రాత పీసుల బారులాగ వుంది. అని ఎగతాళి చేసి వుండొచ్చు. రేపు రైలు దిగేసరికి తల్లి తండ్రులతో పాటు వీళ్ళుకూడా స్టేషన్‌లో కారు గిరు తెచ్చి ఎదురు చూస్తువుంటారు. చాలు ఒక్క కొడుకు ఓ లెక్క మంతుడైనాడు తల్లి వుంటే వీళ్ళని చూసి ఎంత మురిసేదో పిచ్చి ముండ తొందరగా వెళ్ళిపోయింది. హైద్రాబాద్ నుండి రెండు రాత్రులు ఒక దినం ప్రయాణం చేసిన రైలు అలిసి నట్టుగ వేగం తగ్గి కేక వేసి ఢిల్లీ స్టేషన్‌లో ఆగింది.

కూలీల అరుపులు, దిగేవాళ్ళ హడావిడి స్టేషనంతా కోలాహలం. చేతిసంచిని పట్టుకొని వృతకర్రను ఆనిస్తూ ప్లాట్‌ఫారం మీదికొచ్చి నిలుచోని చుట్టుచూశాడు. తన కొడుకు కోడలు ఎవరూ తన కోసం వున్నట్టుగ కనిపించలేదు. రోడ్డు లేదని గమనించిన కూలీలు గూడ ఎవరు వెంకట రామయ్యను పలకరించ లేదు. తాను పలకరిద్దామనుకొన్నా తెలుగోళ్ళు ఎవరిమాట వినపడటంలేదు. అందరూ హిందీ, ఇంగ్లీష్‌ల్లోనే మాట్లాడుతున్నారు. పదినిమిషాల్లో ప్లాట్

ఫామ్ ఖాళీ అయింది. తన మనవడైనా వచ్చి వుండాలి అని బయటికొచ్చి నిలుచున్న కార్ల వైపు చూసాడు. అన్ని కదలి పోతూనే వున్నాయి. ఎవరో ఓ నడి వయస్కుడొచ్చి ''ఆప్‌కా వరంగల్?'' అని అడిగాడు.

వరంగల్ మాట వినగానే ప్రాణం లేచి వచ్చి నట్లైంది వెంకట్రామయ్యకు. అవును అన్నట్లు మళ్ళీ తలవూపాడు.

''నామ్, వెంకటరావ్?" అడిగాడు

అవును అన్నట్లు తల వూపాడు

"నమస్కార్ ఆహియే'' అంటూ అక్కడ సిద్ధంగా వున్న కారును చూపించాడు.

ఇద్దరూ కారు వైపు నడిచారు.

"ఆప్ ఇందీ జాన్‌తే''

''నైజామ్ వాన్ని గదా, ఎదో వచ్చిరాని వురుదు అన్న మాట తెలుసుకోగలను''

"నేను హైద్రాబాద్‌లో కొన్నాళ్ళు టాక్సీ నడిపాను కొంచం కొంచం తెలుగు తెల్సుతది"

వాని పుణ్యం కనీసం నిసైనా పంపాడు అని అను

కుంటుంటే అనుకోకుండా పెదవుల మీద ఓ నవ్వు తన్నుకొచ్చి పెదాలు కంపించాయి. ఆ తర్వాత తన భార్య గుర్తొచ్చి కళ్ళు చెమ్మగిల్లినాయి. కారును చేరగానే డ్రైవర్ వెనక డోర్ తెరచి కూర్చోమన్నట్టు సైగ చేశాడు. వెంకట్రామయ్య కూర్చోగానే తాను తన సీట్లో కూర్చొని కారు స్టార్టు చేసి రైల్వే హద్దులు దాటి మెయిన్ రోడ్డున పడ్డాడు.

వేమయ్య ఆలోచనలు కారుకంటే వేగంగా పరుగెడు తున్నాయి. కరోల్ బాగ్ లోపల విశాలమైన కాంపౌడ్‌లో అధునాతనంగా నిర్మించబడిన ఓ అధునాతనమైన బంగళా ముందాగింది కారు. అప్పటి వరకు మొక్కలకు నీళ్ళు పెడు తున్న తోటమాలి పరిగెత్తుకొచ్చి గేటు తెరిచాడు.

కారు పోర్టుకోలోకొచ్చి ఆగింది.

కొడుకు, కోడలు, మనవడు, మనవరాలు ఎదురొచ్చి వెంకట్రామయ్యను తీసుకుపోలేదు. డ్రైవరే వెంకట్రామయ్యను తీసుకెళ్ళి గెస్టురూం చూపించి అందులో వున్న టాయిలెట్ వగైరా చూపించి, "పానీనహియే. టిఫిన్‌లాయెగా" అంటూ మెయిన్ హాల్ వైపు నడిచాడు. కొద్దిసేపటి తర్వాత పనిమనిషి కాఫీ తెచ్చి పెట్టిపోయింది. టాయ్‌లెట్ గదిలోకెళ్లి అన్నీ ముగించుకొని వచ్చేసరికి కాఫీ చల్లారిపోయి ఆలాగే ఉండి పోయింది.

అమ్మగారు వస్తున్నారు

"నమస్కారం మామగారు అంతాబాగున్నారా?" అంటు కోడలు వొస్తుందనుకుంటే ఆమె దర్పంగా, విలాసంగా వచ్చి ఎదుటి సోఫాలో కూర్చుంటు "ట్రైన్ లేటొచ్చినట్టుంది అయినా మా డ్రైవర్ బాగానే గుర్తించాడే" అంటూ కనుల మీదకొస్తున్న తలవెంట్రుకలను వెనక్కుసర్దుకుంది.

ఈ లోపల మనవరాలు, ఏదో ఇంగ్లీష్ మ్యాగజైన్ చదువుతూ, చదువుతూ ఆపి చేత పట్టుకొని గెస్ట్‌రూం లోనికి తొంగిచూసి

"ఒహో పొగబండి తాతయ్యా! యింకా చుట్టలు కాలు స్తున్నావా?" అంటూ తల్లి పక్కనే సోఫాలో కూర్చున్నది. అనేకంటే కూలబడింది. అంటే బాగుంటుందేమో?

వెంకట్రామయ్య ముఖం విప్పారింది. నోటమాట రాక చూస్తున్నాడంతే.

"మమ్మీ ఏంటి పొగబండి తాతయ్య అలా చూస్తున్నాడు నన్ను గుర్తుపట్టలేదా?"

"అదేంకాదు, స్వీటి ఎంత పెద్దదయింది. అని చూస్తున్నాడు" అంటూ బిడ్డ వైపు చూసింది.

'హు' అని నవ్విన స్వీటినే చూస్తు వెంకట్రామయ్య అంత వొత్తుగ, నల్లగ వొచ్చిన వెంట్రుకలను ఎందుకు కత్తిరించారో అంటూ విస్తుపోయాడు.

అప్పుడే తల స్నానం చేసి టవల్‌తో తుడుచుకుంటు గెస్ట్ రూంలోకి ప్రవేశిస్తూ మనవడు,

"హల్లో! పూరి తాతయ్య ఎంత సేపయ్యింది వచ్చి'' అంటూ నిలుచున్నాడు.

మనవడిని చూసేసరికి వెంకట్రామయ్య మనస్సు ఆనందంతో మునకలు వేసింది. ఆ సంతోషంలో వాడన్న పూరితాతయ్య మాటను గూడ ఏం పట్టించుకోకుండా "అవునోయి పట్టణం మొగోడా మీసాలొచ్చాయే, దగ్గరికి రావోయి" అంటూ రెండు చేతులు చాచాడు.

అతను రాలేదు తల తుడుచుకోవడం అయినాక ముఖాన్ని చేతులను తుడుచుకొంటూ నిల్చున్నాడు.

వెంకట్రామయ్య ఎద పొంగి పోతుంది. తన మనవణ్ణి, మనవరాలును చూసే సరికి ప్రపంచాన్ని జయించి నంత శక్తి అతనిలో చోటు చేసుకుంది.

తన పిల్లలు ఎలా వున్నారో చూడు అన్నట్టు ఓ మాదిరి దర్పంతో ముఖంపెట్టి కాలుమీద కాలువేసుకొని కూర్చుంది కోడలు.

ఎంతో ఆనందం గుండె అంచులు నిండగ. కళ్ళలో నీటి పొర అడ్డురాగా, తన చేతి సంచిలోని పచ్చి వేరుశెనగ కాయల పొట్లం తీసి మీ అత్తయ్య పంపింది'' అంటూ మనవ రాలు వైపు, మనవని వైపు చూపులు మార్చుతూ చూశాడు.

కోడలు వాటి వైపు చూసి చిరునవ్వు నవ్వి ''యివి యిక్కడ రోడ్ల మీద గూడ పది పైసలు పెడితే దొరుకుతాయి'' అంది.

వెంకట్రామయ్య ఒళ్ళు జలదరించింది.

''మన పొలాల్లో పండే పంటంతా ఏమౌతుంది మామగారు, అంతా మీ కూతురు కేనా?''

"వ్యవసాయం ఏముందమ్మా ఎవరు కష్ట పడితే వాళ్ళే అనుభవిస్తారు" ఆ మాత్రం గూడా వినదలుచుకోని కోడలు "పదండి టిఫిన్ చేద్దురు నేను మీటింగ్‌కు వెళ్ళాలి అంటూ లేచి డైనింగ్ హాలు వైపు నడిచింది.''

లేవబోతున్న మనవరాలు వైపు ఓ మాదిరిగా చూస్తు "నీవు కాసేపు కూర్చో" అంటూ ఆశగా చూసి తన చూపులను మనవనివైపు మళ్ళించి ''ఒరే తాతయ్య యిలారా నీవు గూడ కాసేపు కూర్చో?" అన్నాడు.

కానీ యిద్దరూ తాతయ్య మాటలను పట్టించుకోకుండా ఆకలేస్తుంది టిఫిన్, టిఫిన్ అంటూ వాళ్ళు డైనింగ్ హాలు వైపు నడిచారు.

సాయంత్రం ఐదైంది.

''అయ్యగారు, కాఫీ తెమ్మంటారా?" పనిమనిషి గదిలోకి వస్తూ అడిగింది.

అప్పుడే కాస్త నిద్ర తీసి లేచి కూర్చున్న వెంకట్రామయ్య తెమ్మన్నట్టు తలూపాడు.

ఆమె అక్కడి నుండి కదలగానే తాను మేన్‌హాల్లోకి వచ్చి చుట్టు కలియజూసాడు.

ఎవరి అలికిడిలేదు ఒయటి దర్వాజ దగ్గరికి వచ్చి అటు ఇటు తొంగి చూశాడు ఎవరు లేరు కాంపోండ్ మూలకున్న అవుట్ హౌజ్ వరండాలో ఓ స్త్రీ కూర్చొని గోధుమలు చెరుగుతువుంది. ఆమె భుజాల మీద ఏడేళ్ళ బాలిక వొంగి తల్లి చెవిలో ఏమో చెపుతూ వుంది. ఆ ప్రక్కనే వున్న సపోట చెట్టు మొదట కూర్చొని పన్నెండేండ్ల కుర్రవాడు చదువుకుంటున్నాడు.

"కాఫీ తీసుకోండయ్యగారు'' పనిమనిషి తాను నిలుచున్న చోటికొచ్చి అంది. వెంకట్రామయ్య కాఫీ కప్పును అందుకుంటూ "అక్కడ మూలన వున్నదెవరు?''

మన డ్రైవర్ శంకర్ ఆయన భార్య పిల్లలు, అంది

''నీకు తెలుగు బాగానే వొస్తదే నీ పేరు?''

''నా పేరు రజియా మాది గుంటూరే మా ఆయన అయ్యగారి ఆఫీస్ లోనే డ్రైవర్

''వీళ్ళెవరు లేరు? కోడలూ కనపడటం లేదు!''

అమ్మగారు మహిళాసంఘం మీటింగ్‌కు వెళ్లారు. సందీప్ బాబేమో క్రికెట్ ఆడటానికి వెళ్లాడు. స్వీటమ్మేమో సినిమాకో, దోస్తుల యింటికో పోవచ్చు'

'' అయ్యగారు రాలేదా?'' కాఫీ సాసర్లోకి వొంచుకుంటు

''రాలేదండి''

''ఈ రోజు ఆదివారం సెలవుగదా ఎటెళ్లినట్టు!''

''నాకు తెలవదండి, ఎక్కడెక్కడ తిరుగుతరో, ఎప్పు డొస్తడో చెప్పలేము''

''తిండి. గిండి,'' ఖాళీకప్పును తిరిగిస్తూ.

అయ్యగారికి తిండికి కరువా, అయినా యింట్లో ఎప్పుడు

సరిగా తినరు. "అంటూ ఖాళీకప్పును తీసుకొని వంటగది వైపు నడిచింది.

జేబులో నుండి చుట్టతీసి వెలిగించాడు.

ఆరుదాటి ఏడుకావస్తుంది. గెస్టురూమ్ కిటికి దగ్గర కూర్చున్నాడు,

గేటు దగ్గర స్కూటర్ ఆగిన చప్పుడైంది.

ఎవరో ఓ యువకుడు స్వాతిని డ్రాప్‌చేసి, కొంచెంసేపు ఏదోమాట్లాడి, చేయివూపుతూ వెళ్ళిపోయాడు. చేతిలోని వ్యానిటి బ్యాగ్‌ను విలాసంగా వూ పుతూ, వేగంగా నడిచొచ్చేది చూసి, తాను చూడనట్టే కూర్చున్నాడు.

స్వాతీ నేరుగా తన రూంలోకెళ్లి తలుపేసుకుంది.

తన రూంలో కొచ్చి తనతో మాట్లాడుద్దేమో అనుకున్నాడు. కానీ ఆమెరాలేదు.

అరగంట తర్వాత తానేవెళ్లి, అమెగది ముందు నిలుచొని చూశాడు ఎంతసేపు చూసిన గది తలుపు తెరచుకోలేదు.

తలుపు తట్టి పిలవాలని పించింది. ఆపని చేయలేక వచ్చి తీనువుంటున్న గదిలో చూర్చున్నాడు.

ఎనిమిదైంది.

మళ్లీ గేటు తెరిచిన చప్పుడు కాగానే, కిటికిలో నుండి చూశాడు ముందు సందీప్ అతని వెంట అతనిలాంటి బట్టలే తొడుకున్న మరో వ్యక్తి యిద్దరు చేతిలో చేయివేసుకొని నడి చొచ్చి తనగది వైపు కూడ చూడకుండా, సందీప్ గదిలోకి వెళ్లి తలుపేసుకున్నారు. కూడా వచ్చినది ఆడపిల్లో మొగపిల్ల వాడో అనేది వెంకట్రామయ్యకు అనుమానం

మనవడు తనను పలకరించనందులకు మనస్సు చివుక్కు మంది.

పనిమనిషి రాకతో ఆలోచనలను ఆపి ఆమె వైపుచూశాడు.

''భోజనాన్ని యిక్కడికి తెమ్మంటరా అక్కడికొస్తారా?''

''కోడలురాలేదా''

''రాలేదు. అమ్మగారు వచ్చేసరికి బాగారాత్రి అవుతుంది.''

"మరి పిల్లలు తినరా."

వాళ్లిష్టం వాళ్ళకు ఆకలైతే వచ్చితింటే తింటారు లేకుంటే గదిలోకే తెమ్మంటరు. వాళ్ళతో పెట్టుకుంటే మీకు కుదరదయ్య గారు మీరుతినండి."

"నాకు ఆకలిగా లేదు"

"అయితే పాలు, పండ్లు తెమ్మంటారా"

"అవి గూడా అక్కరలేదు"

"మీ ఇష్టం. తెప్పిచ్చితే పెడతాను." అంటూ వెళ్ళింది.

వెంకట్రామయ్య ఆలోచనలు పరిపరివిధాల పరిగెత్తినవి. తన కొడుకు నిన్నటినుండి యింటికి రాలేదు. కోడలు యింటి పట్టున వుండదు' పిల్లలను సంసారాన్నంతా పని మనిషి మీద వొదిలారు.

పని మనిషి ట్రేలో కొన్ని పండ్లు, ఓ గ్లాసు నిండాపాలు తెచ్చి టీపాయ్ మీద వుంచి వెళ్ళింది.

తొమ్మిదైంది.

గేటు దగ్గర కారాగిన శబ్దం. తన గది తలుపు మూసు కొని కిటికిని గూడా ఓరగా మూసి చూస్తున్నాడు.

డ్రైవర్ దిగి గేటును తెరచి కారును లోనికి రానిచ్చి పోర్టికో కింద ఆపాడు

కోడలు కారుదిగి, జారుతున్న కొంగును సరిచేసుకొంటూ,

మత్తెక్కిన కళ్లతో కాళ్ళు తడబడుతుండగా యింట్లోకి నడిచింది. డ్రైవర్ కార్ లాక్ చేసి గేటుమూసి, అవుట్ హౌజ్ వైపు నడిచాడు. పని మనిషి ఎదురుగవొచ్చి కోడలిని మేడ మీద గదిలోకి తీసుకెళుతూవుంది.

తలుపును కొద్దిగా తెరచుకొని కోడలి వాలకాన్ని, ఆమె నడకను చూస్తున్నాడు. ఆమె పిల్లల గదులవైపు గూడ చూడకుండా తన గదిలోకి వెళ్ళిపోయింది.

ఈ లోపల సందీప్ గదిలో నుండి సన్నని డిస్కోమ్యూజిక్ వినిపిస్తూంది.

తన కొడుకు ఇంకా రాలేరు, నిద్రా రావటం లేదు బయటికొచ్చి అవుట్ హౌజ్ వైపు చూశాడు.

డ్రైవర్ బార్య భర్త రాకను గమనించి వెళ్ళి, నీళ్ళ బకెట్ తెచ్చి పెట్టి చెంబు చేతికిచ్చి, టవల్ పట్టుకొని నిలుచుంది. అతను కాళ్ళుచేతులు కడుక్కొని ముఖం తుడుచుకుంటూ వరండాలో చదువుకుంటున్న తన కొడుకును చూస్తు తన భార్య ముందునడవగ తాను ఆమెను అనుసరిస్తూ లోనికినడిచాడు. అరగంట తర్వాత బోజనం ముగించుకొని భుజం మీద టవల్‌తో చేతిని తుడుచుకుంటు, వొచ్చి చదువుతున్న తన కొడుకు పక్క కూర్చున్నాడు భార్య అన్ని సర్దివొచ్చి మరో ప్రక్కన కూర్చుంది.

తన కొడుకు రాలేదు. ఎక్కడికి వెళ్ళింది ఎవరు చెప్పే ట్టు లేరు. వెంకట్రామయ్య మెల్లగా అవుట్ హౌజ్ వైపు నడిచాడు. అతని రాకను గమనించి డ్రైవర్ అతని భార్య నిలుచున్నారు.

వెంకట్రామయ్య కొంచెం దూరంలోనే ఉండి డ్రైవర్‌ను రమ్మనట్టు సైగచేశాడు. అది గమనించి డ్రైవర్ శంకర్ దగ్గరికి రాగా యిద్దరూ కలిసి కారు వైపు నడిచారు.

"అయ్యగారు యింకా రాలేదేమిటి?"

"నహీ మాలూమ్ సాబ్"

"నీవు ఆయన ఆఫీసుకు వెళ్ళవా"

"నహీ, గవర్నమెంట్ జీప్‌కో అలగ్ డ్రైవర్ హై, మైకారు చలాతాహుం"

"సరే యింతకీ ఎక్కడకి పోవచ్చు"

తెలియదు అన్నట్టు తలవూపి చేతులు కట్టుకొని నిలుచు న్నాడు. అతనికి నలభైఐదు ఏళ్ళుండొచ్చు. అక్కడక్కడ తల కూనెరిసింది.

"చూడు శంకర్ నేనే అర్జంటుగ కలవడానికొచ్చినా,

వచ్చి ఆఫీసర్స్ క్లబ్ నెంబర్ డయల్ చేశాడు శంకర్ కలవ లేదు, మళ్లీ చేశాడు. ఎంగేజ్ సౌండ్, తిరిగిచేశాడు. ఎన్నిసార్లు చేసినా ఎంగేజ్ సౌండ్. ఫోన్ పెట్టేసి బయటికి వచ్చారు. కారు ఆఫీసర్స్ క్లబ్ ముందాపి అయ్యగార్ని వెంటబెట్టుకొని, క్లబ్ ముందున్న లాన్స్‌లోని మెర్క్యూరి లైట్ వెలుతురులో పేకాడుకుంటున్న, డ్రైవర్ల దగ్గరకి వెళ్లి నిలుచున్నాడు.

ఆడేవాళ్లు ఆటలో, ఆడనివాళ్లు పక్కపక్కనే కూర్చొని చూస్తున్నారు. అయ్యవారి డ్రైవర్ ఖాసింనుచూసి,

''ఖాసీంబాయి సాబ్ హై!''

'సాబ్ అందర్ అయేతో'' హి డ్రైవర్ బాహర్ రహతా ఓ డ్రైవర్ ''అయ్యగారి కోసం, పూర్తి కాకముందే

"అఫీసుకు ఆవోబోలో'' పక్కవాడేసిన ఆకును అం'!

కుంటూ

"ఓ నహీ''

''నహితో వకీల్‌కే పాస్ జావోబోలో'' చేతిలో ఆకు తీవ్రంగా పరిశీలిస్తు పక్కకు జరుపుతూ

"ఏసాబ్,,

"మేరా ఖేల్ హోనేదేవో, బాత్‌కరింగే" కాస్త కదిలి కూర్చుంటు శంకర్ వెంకట్రామయ్య గారి వైపు చూస్తు

"వాడు ఆటపిచ్చిలో వున్నాడు. వాడే అయ్యగారి ఆఫీసు డ్రైవర్. మీరు యిక్కడే వుండి కొంచెం అయినంక వాని ద్వారా మీరొచ్చినట్టు చెప్పి పంపండి. నేను హొయ్యేవరకు నా భార్య నిద్రపోదు. అదిగాక నేను మిమ్ముల్ను యిక్కడికి తీసుకొచ్చి నట్టుకూడ అయ్యగారికి తెలువొద్దు" అని సరళమైన హిందీలో చెప్పి, కారువైపు నడిచాడు.

వెంకట్రామయ్య విషయాన్ని గ్రహించాడు.

ఖాసీం చూపించలేని రమ్మీ యింకొకరు చూపించే సరికి ఖాసీం తన పేకలను కసిగ నేలమీద విసిరి బీడి వెలిగించి, ఎదురుగా నిలుచున్న వెంకట్రామయ్య వైపు ఆయన వేషం చూసి, తెలుగు వాడని గ్రహించి తాను గుంటూరు సాహెబ్ కొట్టి "తెలుగులోనే చెప్పుతండ్రి అన్నాడు"

"శ్రీనివాసరావు కావాలి"

'మనదేవూరు, యిక్కడి కెందుకు వచ్చారు? అసలు యిక్కడికి రావాచ్చాయిది అపీసర్స్ క్లబ్ కానీ ఆఫీస్ కాదని తెలియదా? అంత అవసరముంటే ఆఫీస్‌టైమ్‌కు యింట్లో కలుసుకోవాలి కానీ క్లబ్ టైమ్‌లో కలవ వద్దని తెలియదా" అంటూ బీడి సగం కాలేవరకు దమ్ములాగి, హొగముక్కునుండి వొదలి

కాలినబీడి బాగాన్ని పక్కకు దులిపాడు.

"ప్రయత్నం చేసిన కానీ"

"కానీ 'కుదర లేదనకు. వకీల్లున్నారు గదయ్య కుదర్చటానికి' మళ్ళీ దమ్ములాగుతూ

"మన దేవూరు ఏంబిజినెస్"

"మాది వరంగల్"

"అంటే అయ్యగారి వూరే!

'అదే నేను వారి తండ్రిని"

"మరి ముందే చెప్పలేదేమండి" అంటూ చేతిలోని బీడిని పారేసి దిగ్గున లేచి ప్రక్కనే పడివున్న స్లిప్పర్స్‌ను గబ గబా తొడుక్కొని

"ఒరే భాయిసాబ్‌లు మీరు ఆడుతూ వుండండి" అంటూ లేచొచ్చి వెంకట్రామయ్య ఎదురుగా చేతులు కట్టుకొని నిలుచున్నాడు. మిగతా వాళ్ళు ఆటలో మునిగిపోయారు.

"అయ్యగారు యింటికొస్తారా?"

"చెప్పలేం నిన్నటినుంచి ఆడుతున్నారు. లేవటం లేదు"

కొంచెం విసుగ్గా

"మరి నేను వచ్చినట్లు చెప్పొస్తావా"
మాట్లాడలేదు

"ఏమనడులే వెళ్ళి చెప్పు"

ఖాసీం ఆలోచనలో పడ్డాడు. ఈ లోపల లోపలినుండి బయటి కొస్తున్న క్లబ్ బోయ్-

"ఖాసీం భాయి కాడీదేసా" అంటూ సిగరేట్ నోట్లో పెట్టుకొని వచ్చి నిలుచున్నాడు

"సాబ్‌లోగ్ ఉట్‌నేకా మోకా హై? అని అడుగుతూ అగ్గిపెట్టె అతని చేతిలో వుంచగా ఆతను సిగరెట్ ముట్టించి తిరిగిస్తు పొమ్మలాగివదిలి.

"ఎక్కడ భాయి, మీ అయ్యగారి డబ్బులు బాగా పోతున్నయి. తిరిగి రాబట్టాలని ఎవర్ని లేవనియ్యడం లేదు. బాటిల్స్‌కు బాటిల్స్ ఖాళీ అవుతున్నయి. మీ అయ్యగారి టేబుల్ చుట్టు సీతాకోక చిలుకలు వాలినయి. అయ్యగారు ఎంతేస్తడు భాయి వొరద వొస్తది-పోతది'' అంటు హిందిలో చెప్పాడు

దాన్ని వెంకట్రామయ్య గ్రహించాడు.

ఎక్కువ మాట్లాడం బాగుండదని ఖాసీం వెంకట్రామయ్య వైపుసైగ చేసి, ''పదండి చెపుతాను'' అంటూ జీప్ దగ్గిర్కి వచ్చి ఆగి—

''తమరు యిక్కడ వుండటం బాగుండదు. ముందు తమరిని యింటి దగ్గర దించొచ్చి, అయ్యగార్ని కలిసి మీరు వచ్చారని చెప్పి, తీసుకొస్త పదండి'' అంటూ జీపెక్కి స్టార్టు చేశాడు. వెంకట్రామయ్య బుర్రలో ఆలోచనలు.

మధ్య రాత్రి దాటింది. వెంకట్రామయ్య చుట్టు వెలిగించుకొని, గేటు దగ్గర నిలుచొని కొడుకు రాక కోసం ఎదురు చూస్తున్నాడు.

— చుట్ట పూర్తిగా కాలిపోయింది. మరో చుట్టను ముట్టించుకున్నాడు. తన వూరు తన బతుకు కళ్ల ముందు కొచ్చింది.

తన తాత బాగానే బతికాడని తన తండ్రి అనగా విన్నాడే తప్ప తాను చూడలేదు. తన తండ్రి మాత్రం బాగానే బతుకుతూ తనను బతికిచ్చాడు. తాను తన తండ్రి కలిసి వ్యవసాయన్నెంతో పెంపుచేసుకున్నారు. తాను తండ్రి అయ్యేవరకే ఊళ్లో మంచిగా ఉన్న వాళ్ల సరసన చేరారు.

పొగాకు పంట బాగా పండటం మూలానా గుంటూరుకు

రాక పోకలు పెరిగాయి. అక్కడి స్నేహితుల సలహాతో తన కొడుకును మిషన్ స్కూల్లో చేర్చి మెట్రిక్యులేషన్ కాగానే మద్రాస్‌కు పంపడం జరిగింది. తన మనవడు మద్రాసులో చదువుతున్నాడని మా అమ్మా నాన్నలు ఎంతో పొంగి పోయేవారు. ఎప్పుడైనా సెలవుల్లో వస్తే వాన్ని ఒక్క క్షణం వదిలి పెట్టేవాళ్ళు కాదు. ఆవకాయ పచ్చడి, గడ్డ పెరుగు, వొద్దు వొద్దు అంటున్న వానినోట్లో కుక్కేది. వానికి కుతిక పడుద్దని' వాని తల్లి తల్లడిల్లుతూ తన దగ్గరకు లాక్కునేది. వాడు ఎవరి దగ్గరా వుండకుండా నా దగ్గరికి పరుగెత్తుకొచ్చే వాడు. వాడు కాలేజీ చదువు వరకొచ్చినప్పటికి, ఇంట్లో అందరూ చిన్న పిల్లాడిలాగ గారాబం చేసేవాళ్ళు "నా మనవడు కలెక్టరు ఆయితడు" అని మా నాయన మీసం తిప్పేవాడు

"వాన్ని పొగిడి చదవకుండా చేయకుండ్రా చదువు సాగక పోతే మళ్ళీ కాడి దున్నవలసి వస్తది" అని మా నాన్న మీద తల్లి యిరుచుక పడేది. మా అమ్మా వాన్ని గారాబంగ బతి మిలాడేటిది. అందరు ముద్దు ముచ్చట చూడకుండా పోయారు. మిగిలిన నేను ముద్దు ముచ్చట అటుంచి ముదనష్టపు వ్యవ హారాలన్ని చూడాల్సి వచ్చింది;

చివరివరకు తాగిన చుట్టను నేలపై వేసి చెప్పుతో రాసాడు. ఈ లోపున జీప్ వచ్చి ఆగింది. తానే గేటు తెరచి కళ్ళకు కొడుతున్న లైటు వెలుతురుకు చెయి అడ్డం పెట్టుకొని

నిలుచున్నాడు. దర్జాగా ఫుల్ సూట్ లో దిగిన కొడుకు మామూలుగా యింట్లోకి వెళ్లబోతున్నాడు.

"ఏంరా నాయన యింత రాత్రి అయ్యింది."

కాలు ముందుకు సాగలేదు వెనక్కు మళ్ళి "ఎప్పుడొచ్చారునాన్న" రేబాన్ అద్దాలను సవరించుకుంటు

"నేను ఎప్పుడో వచ్చాను కానీ నీవు ఇప్పుడు రావటం ఏమిటి?''

"మాదో బోర్డు మీటింగ్ వుంటె దాన్ని అటెండ్ అయి" పెదాల పై నవ్వును పులుముకుంటు

"ఏ మీటింగ్ వున్నా, ఎన్ని పనులున్నా సాయంత్రం యిల్లు చేరాలని గుర్తుండదా మనషుల కంటే పక్షులే నయం చీకటి పడగానే గూడు చేరుతాయి''

తప్పు చేసిన వాడిలా తలవంచి నిలుచున్నాడు శ్రీనివాసరావు.

"నీవు నీ పనులు, నీ దోస్తులు, నీలోకం నీకే అయితే యిల్లెటు పోవాలి? పిల్లలూ? నీ భార్య బాగా చదువుకున్నదని మురిసితివి పొద్దల్లా యిల్లొదిలిపోయేది చూడవైతివి — నేనెందు కనాలి వెళ్లిచూడు నీకే తెలుసుద్ది"

మత్తు దిగిపోయిన శ్రీనివాసరావు వెంటనే చకా చకా డైనింగ్ హాల్లోని వాష్ బేసిన్ దగ్గర ముఖం కడుక్కొని ఖర్చీఫ్‌తో అద్దుకుంటూ డైనింగ్ టేబుల్ వైపు చూశాడు అన్ని సర్ది వున్నవి. ఎవరూ తిన్నట్టు లేదు. ఓ చిట్టెలుక పెట్టివుంచిన మూతలను లేప లేక పాత్రల చుట్టుతిరుగుతు వుంది, దానిని కాపెట్టుకొని మూలన నక్కి కూర్చుంది పిల్లి.

కూతురు గదిలో విడియో ఫిల్మ్ నడుస్తున్న శబ్దం, కొడుకు గదిలో డిస్కోమ్యూజిక్ వినిపిస్తువుంది.

మేడపైకి ఎక్కి బెడ్‌రూంవైపు నడిచాడు. బోల్టు వేయకుండా మూసివుంచిన తలుపులను నెట్టుకొని లోనికి ప్రవేశించినా గమనించినట్టు లేదు భార్య.

ఆమె రెండు బెడ్ మీద చిత్తుగా తాగి పడుకొని వుంది. ల్లారి ఉదయం గెస్ట్ రూమ్‌లో వెంకట్రామయ్య లేడు "శంకర్" డ్రైవర్‌ను పిలిచాడు -రావు. డ్రైవరొచ్చి ముందునిలుచేగానే

"పితాజీ కాహా హై?"

శంకర్ మట్లాడ లేదు.

"బోలో పితాజి-"

అయ్యగార్ని ఉదయం ఐదు గంటలగే స్టేషన్‌లో వొదిలొచ్చాను, తమరికి చెప్పమన్నారు. అంటు హిందీలో జవాబిచాడు.

రావు నోట మాట రాలేదు.

ఒక్కసారే మనిషి కదిలిపోయి తనను తానే సంభాలించుకొని మౌనంగా లోనికి నఘచాడు. హైదరాబాద్ వెలుతున్నరైలు తన తలపై నడిచినట్లనిపించగా తనకు తెలియకుండానే "అమ్మా" అంటూ కణతలను వత్తుకుంటూలోని నడిచాడు. అప్పుడతనికి తన యిల్లు వైకుంఠపాళిలా కనిపించింది.